సాక్షి
పశ్చిమగోదావరి


గురువారం । 25 । ఏప్రిల్ । 2024



ఉద్యాన పంటలు భేష్

రాష్ట్రంలో ఉద్యాన పంటలు బాగున్నాయని ఐసీఏఆర్ డైరెక్టర్, అటారీజోన్ నిర్దేశకులు డాక్టర్ షేక్ ఎన్.మీరా అన్నారు.

8లో ▸



వలసల వరద

ఎన్నికల సమీపిస్తున్న సమయంలో వైఎస్సార్‌సీపీలో చేరికలు మరింత జోరందుకున్నాయి. ఇతర పార్టీల నేతలు భారీగా వచ్చి చేరుతున్నారు.

8లో ▸



పెళ్లింట విషాదం

కారులో వెళుతుండగా రోడ్డు ప్రమాదంలో వధువు తల్లి మృతిచెందగా, వధువు తీవ్రంగా గాయపడిన ఘటన బంటుమిల్లి మండలంలో చోటుచేసుకుంది.

8లో ▸

న్యూస్‌రీల్

సాధారణ పరిశీలకురాలిగా దీప



భీమవరం (ప్రకాశంచౌక్): ఎన్నికల సాధారణ పరిశీలకురాలు ఎం. దీప జిల్లాకు విచ్చేశారు. మంగళవారం రాత్రి భీమవరానికి చేరుకున్న ఆమెకు జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ సుమిత్ కుమార్, జాయింట్ కలెక్టర్ సీవీ ప్రవీణ్ ఆదిత్య స్వాగతం పలికారు. అనంతరం జిల్లాలో ఎన్నికల ఏర్పాట్లపై జిల్లా ఎన్నికల అధికారి సుమిత్ కుమార్ ఆమెకు వివరించారు. జిల్లాలోని ఓటర్లు, పోలింగ్ స్టేషన్లు, సమస్యాత్మక, అతి సమస్యాత్మక కేంద్రాలు, చెక్ పోస్టులు తదితర అంశాలపై కలెక్టర్ ఆమెతో చర్చించారు.

పారదర్శకంగా ధాన్యం కొనుగోలు



ప్రవీణ్ ఆదిత్య, జేసీ

భీమవరం: ప్రస్తుత దాళ్వా పంట ధాన్యం కొనుగోలు ప్రక్రియ అత్యంత పారదర్శకంగా జరుగుతుందని ఫిర్యాదు రహితంగా నిర్వహిస్తున్నట్టు జాయింట్ కలెక్టర్ సీవీ ప్రవీణ్ ఆదిత్య బుధవారం తెలిపారు. రైతులు ధాన్యం అమ్మకాలకు సంబంధించి ఇబ్బందులుంటే కలెక్టరేట్‌లోని కంట్రోల్ రూమ్ 81216 76653 నంబర్‌కు ఫోన్ చేయవచ్చునన్నారు. రైతులు ధాన్యం విక్రయాలు, గోనె సంచుల ప్రక్రియలో ఇబ్బందులుంటే కంట్రోల్ రూమ్‌కు తెలియజేయాలని సూచించారు.

లోసరి చెక్‌పోస్టు తనిఖీ



రికార్డులు పరిశీలిస్తున్న అబ్జర్వర్ దీప

భీమవరం అర్బన్: జిల్లా సరిహద్దులోని లోసరిలో జాతీయ రహదారిపై చెక్‌పోస్టును ఎన్నికల పరిశీలకురాలు ఎం.దీప బుధవారం తనిఖీ చేశారు. నగదు, వస్తువుల స్వాధీనం, మద్యం అక్రమ రవాణా కట్టడిపై ఆరా తీసి రికార్డులు పరిశీలించారు. అనంతరం దొంగపిండి, కొత్తపూసలమర్రు, అనాకోడేరు, గొల్లవానితిప్ప గ్రామాల్లో సమస్యాత్మక పోలింగ్ స్టేషన్‌ను ఆమె సందర్శించారు. అక్కడ మౌలిక వసతుల కల్పనను పరిశీలించారు. అధికారులంతా అప్రమత్తంగా ఉండాలని సూచించారు. జిల్లా ఎన్నికల ట్రైనింగ్ అధికారి, లైజనింగ్ అధికారి కేసీహెచ్ అప్పారావు, ఆర్ఐ నారాయణ ఆమె వెంట ఉన్నారు.

ప్రశాంతంగా టీసీసీ పరీక్షలు

ఏలూరు (ఆర్ఆర్‌పేట): జిల్లాలో టెక్నికల్ సర్టిఫికెట్ కోర్సు పరీక్షలు బుధవారం కొనసాగాయి. డ్రాయింగ్ లోయర్ పరీక్షకు 33 మందికి గాను 15 మంది, హయ్యర్ పరీక్షకు 11 మందికి 8 మంది హాజరయ్యారు. పరీక్షలు ప్రశాంతంగా జరిగాయని డీఈఓ ఎస్.అబ్రహం ప్రకటనలో తెలిపారు.

ఏలూరు టీడీపీ అభ్యర్థిపై పేకాట, ఫోర్జరీ, చీటింగ్ కేసులు.. నూజివీడు టీడీపీ అభ్యర్థి కొలుసు పార్థసారథిపై విదేశీ నగదు మార్పిడి ఘటనలో ఫెమా చట్టం కింద కేసు నమోదు.. ఇక ఏలూరు ఎంపీ అభ్యర్థి పుట్టా మహేష్ యాదవ్‌పై ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసు.. ఫైనల్‌గా దెందులూరు టీడీపీ అభ్యర్థి చింతమనేనిపై లెక్కకు మించి రికార్డు స్థాయిలో కేసులు.. రాష్ట్రంలోనే అత్యధిక కేసులు ఉన్న అభ్యర్థిగా చింతమనేని సరికొత్త రికార్డు. వీరంతా ఏలూరు పార్లమెంట్ నియోజకవర్గంలో కూటమి పార్టీల నుంచి పోటీ చేస్తున్న నేతలు. ఎన్నికల అఫిడవిట్‌లో ప్రతిఒక్కరూ కేసుల చిట్టాను సమర్పించారు.



కూటమి నేతలపై క్రిమినల్ కేసులు

- 93 కేసుల రికార్డుతో చింతమనేని రాష్ట్రంలో నంబర్‌వన్
- పేకాట, ఫోర్జరీ కేసుల్లో బడేటి చంటి
- విదేశీ నగదు మార్పిడి కేసులో కొలుసు పార్థసారథి
- పుట్టా మహేష్‌పై ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసు
- పొత్తుల నేతలపై కేసులు ఘనం

సాక్షిప్రతినిధి, ఏలూరు: ఏలూరు పార్లమెంట్ నియోజకవర్గంలో టీడీపీ, బీజేపీ అభ్యర్థులపై కేసులు కోకొల్లలుగా ఉన్నాయి. ఎన్నికల్లో పోటీచేసే అభ్యర్థులు వివాదరహితులు, సచ్ఛీలురుగా ఉండాలనదే ప్రజల ఆకాంక్ష. ఇక కూటమి అభ్యర్థులు ఇదే రీతిలో విస్తృతంగా ఆటోలు పెట్టి, ఇంటింటికి తిరిగి మరీ మేం చాలా మంచివాళ్లం.. మాకే ఓటు వేయండి అంటూ ప్రచారం చేసుకుంటున్నారు. ఎన్నికల నామినేషన్ల సందర్భంగా ప్రతిఒక్కరూ సమర్పించే అఫిడవిట్‌లో కేసుల చిట్టాను చూసి అందరూ అవాక్కవుతున్నారు. ఇవేమీ ప్రభుత్వ కక్ష సాధింపుతో గడిచిన ఐదేళ్లల్లో పెట్టిన కేసులు కూడా కాదు. అన్నీ అంతకుముందే వారి వ్యాపార, క్రిమినల్, స్వభావాల రీత్యా నమోదైన కేసులు.

కేసుల్లో చింతమనేని టాప్

దెందులూరు టీడీపీ అభ్యర్థి చింతమనేనిపై 93 కేసులు నమోదయ్యాయి. బహుశా రాష్ట్రంలోనే ఈ స్థాయిలో కేసులు నమోదైన అభ్యర్థులు ఎవరూ లేకపోవడంతో అత్యధిక కేసులతో పాటు రౌడీషీట్ ఉన్న అభ్యర్థిగా చింతమనేని రికార్డుకెక్కారు. మాజీ మంత్రి వట్టి వసంత్‌కుమార్‌పై దాడి కేసులో రెండేళ్ల జైలు శిక్ష కూడా పడింది. అప్పీలుకు వెళ్లి ప్రస్తుతం కోర్టులో కొనసాగుతుండటంతో ఎన్నికల్లో పోటీ చేస్తున్నారు. కొల్లేరులో అటవీ శాఖాధికారులు, ముసునూరులో తహసీల్దార్ వనజాక్షి, దెందులూరు నియోజకవర్గంలో అక్రమ మైనింగ్ అడ్డుకున్నారని మైనింగ్ ఉద్యోగులు, ట్రాఫిక్ పోలీసులు, సిటీ పోలీసులు, సాధారణ పౌరులు ఇలా లెక్కకు మించి చింతమనేని బాధితులు ఉండటంతో అదే సంఖ్యలో కేసులు కూడా నమోదయ్యాయి.

అట్రాసిటీ కేసులో పుట్టా మహేష్

ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసులో ఏలూరు టీడీపీ అభ్యర్థి పుట్టా మహేష్ ఉన్నారు. వైఎస్సార్ కడప జిల్లా చాపాడు పోలీస్‌స్టేషన్ పరిధిలో చిన్నగురివిగాల ఎల్లయ్యను కులం పేరుతో దూషించి తీవ్ర స్థాయిలో బెదిరించారు. ఇది 2014లో జరిగిన ఘటన, 103/2014 నంబరుతో ఎఫ్ఐఆర్ నమోదైంది. ఎల్లయ్యను బెదిరించిన ఆడియో తీవ్రస్థాయిలో వైరల్ అయింది. అసభ్యపదజాలంతో దూషిస్తూ మాట్లాడటం అప్పట్లో తీవ్ర చర్చనీయాంశంగా మారింది.

పేకాట కేసుల్లో బడేటి చంటి

ఏలూరు తెలుగుదేశం అభ్యర్థి బడేటి చంటి పేకాటలో ప్రముఖ వ్యక్తి. ఏలూరు చుట్టుపక్కల జిల్లాలే కాకుండా విశాఖ వెళ్లి ఆడుతుంటారు. ఈ క్రమంలోనే భీమిలిలో రెండేళ్ల క్రితం పేకాడుతూ పట్టుపడ్డారు. 66/2022 నంబరుతో కేసు నమోదైంది. అలాగే ఏలూరులో సీసీ 254/2022 నంబరుతో ప్రైవేటు కేసు నమోదైంది. ఫోర్జరీ, చీటింగ్ సెక్షన్లు నమోదు చేసిన కేసు కోర్టులో విచారణ కొనసాగుతుంది.

విదేశీ నగదు మార్పిడి కేసులో పార్థసారథి

మాజీ మంత్రి, నూజివీడు టీడీపీ అభ్యర్థి కొలుసు పార్థసారథిపై మూడు కేసులు ఉన్నాయి. ఘంటసాల, విజయవాడ పోలీస్‌స్టేషన్లలో రెండు చిన్నపాటి కేసులు నమోదయ్యాయి. ఇక విదేశీ నగదు మార్పిడి కేసులో ఫెమా చట్టం కింద కేసు నమోదైంది. అది కూడా 22 ఏళ్ల క్రితం నమోదైన కేసు. హైదరాబాద్‌లోని స్పెషల్ ఎకానమీ అఫెన్స్ కోర్టులో సీసీ 69/2002, సీసీ 99/2002 నంబర్లతో కేసు నమోదైంది. 69/2002 కేసులో రూ.5 వేలు జరిమానా విధించగా, 99/2002లో రెండు నెలల సాధారణ జైలు శిక్ష, రూ.10 వేలు జైలు శిక్ష విధించారు. దీనిపై సుప్రీంకోర్టు నుంచి స్టే తెచ్చుకుని రాజకీయాల్లో కొనసాగుతున్నారు.

ఉరకలెత్తిన ఉత్సాహం



పాలకొల్లులో నామినేషన్‌కు ర్యాలీగా వెళుతున్న వైఎస్సార్‌సీపీ అభ్యర్థి గుడాల గోపి

పాలకొల్లు అర్బన్: పాలకొల్లు పట్టణం జై జగన్ నినాదాలతో హోరెత్తింది. వైఎస్సార్ సీపీ ఎమ్మెల్యే అభ్యర్థి గుడాల శ్రీహరి గోపాలరావు (గోపి) నామినేషన్ కార్యక్రమం ఉత్సాహంగా సాగింది. భారీ ర్యాలీగా పార్టీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులతో కలిసి వెళ్లి నామినేషన్ సమర్పించారు. నియోజకవర్గంలోని పోడూరు, యలమంచిలి, పాలకొల్లు పట్టణం, పాలకొల్లు మండలాల నుంచి పెద్ద సంఖ్యలో తరలివచ్చారు. పూలపల్లి సెంటర్ నుంచి ర్యాలీ రైల్వేగేటు సెంటర్, పోలీస్‌స్టేషన్, గుత్తులవారి తోట, లాకు సెంటర్, గాంధీబొమ్మల సెంటర్ మీదుగా సాగింది. మున్సిపల్ కార్యాలయంలో ఆయన ఆర్‌ఓకు నామినేషన్లు సమర్పించారు. వైఎస్సార్‌సీపీ నరసాపురం ఎంపీ అభ్యర్థి గూడూరి ఉమాబాల ఉన్నారు.

కూటమి నేతల తోపులాటలు

నరసాపురం: నరసాపురం పట్టణంలో ఎన్నికల ప్రచారంలో టీడీపీ, జనసేన నాయకుల మధ్య విభేదాలు భగ్గుమన్నాయి. రెండు పార్టీల దిగువ శ్రేణి నాయకులు తోపులాటలకు దిగడంతో ఆయా పార్టీల కార్యకర్తలు ముక్కున వేలేసుకుని చల్లగా జారుకున్నారు. బుధవారం సాయంత్రం 5 గంటలకు జరిగిన ఈ ఘటనతో కూటమి అభ్యర్థి ప్రచారాన్ని నిలిపివేశారు. వివరాలిలా ఉన్నాయి.. నరసాపురం పట్టణానికి చెందిన జనసేన నాయకుడు దివి సత్యన్ ఇటీవల జరిగిన కూటమి నాయకుల అంతర్గత సమావేశంలో చంద్రబాబుపై అనుచిత వ్యాఖ్యలు చేసినట్టుగా తెలిసింది. ఈ నేపథ్యంలో కోటిపల్లివారి వీధిలో కూటమికి చెందిన మూడు పార్టీల వారు ప్రచారం సాగిస్తుండగా సత్యన్ అక్కడికి చేరుకోవడంతో టీడీపీ ఇన్‌చార్జ్ పొత్తూరి రామరాజు అనుచరుడు జక్కం శ్రీమన్నారాయణ మా పార్టీ అధినేతను తిడతావా? అంటూ సత్యన్‌ను నిలదీయడంతో గొడవ మొదలైంది. దీంతో ఇరుపార్టీల నాయకులు తోపులాటకు దిగారు. ఈ ఘటనతో నరసాపురంలో కూటమిలో కుంపట్లు బయటపడ్డాయి.

పోస్టల్ బ్యాలెట్‌ను వినియోగించుకోండి



మాట్లాడుతున్న డీఆర్వో ఉదయ భాస్కరరావు

భీమవరం (ప్రకాశంచౌక్): అర్హులైన ప్రతిఒక్కరూ పోస్టల్ బ్యాలెట్‌ను సద్వినియోగం చేసుకోవాలని జిల్లా రెవెన్యూ అధికారి జె.ఉదయ భాస్కరరావు తెలిపారు. బుధవారం డీఆర్వో చాంబర్‌లో పోస్టల్ బ్యాలెట్ నమోదుపై వివిధ శాఖల అధికారులతో ఆయన సమీక్షించారు. ఈ సందర్భంగా డీఆర్వో మాట్లాడుతూ ప్రతిఒక్కరూ ఓటును సద్వినియోగం చేసుకోవాలనే లక్ష్యంగా పోస్టల్ బ్యాలెట్‌కు ఎన్నికల సంఘం విస్తృత చర్యలు చేపట్టిందన్నారు. వివిధ శాఖల్లో పనిచేస్తూ మే 13న ఓటు వేయడానికి వీలుకాని వారు పోస్టల్ బ్యాలెట్ నమోదు చేసుకొని మే 6,7,8 తేదీల్లో ఫెసిలిటేషన్ సెంటర్ ద్వారా ఓటు హక్కును వినియోగించుకునేలా చర్యలు చేపట్టామన్నారు. అలాగే 85 ఏళ్లు దాటిన వారు, 40 శాతం వికలాంగత్వం కలిగిన వారు హోమ్ ఓటింగ్‌కు అర్హులని తెలిపారు. ఇప్పటివరకు జిల్లాలో 1,133 మంది హోమ్ ఓటింగ్‌కు నమోదు చేసుకున్నారన్నారు.

33 శాఖల ఉద్యోగులు : ఎన్నికల విధుల్లో భాగంగా పోలింగ్ రోజు అత్యవసర సర్వీసులో పనిచేసే 33 శాఖలకు చెందిన ఉద్యోగులు, సిబ్బందికి పోస్టల్ ఓటింగు సౌకర్యం కల్పించారన్నారు. వారు ఫారం–12డిని రిటర్నింగ్ అధికారికి అందజేసి, రిటర్నింగ్ అధికారి కార్యాలయంలో ఏర్పాటుచేసిన ఫెసిలిటేషన్ సెంటర్‌లో వచ్చేనెల 6, 7, 8 తేదీల్లో పోస్టల్ బ్యాలెట్ ద్వారా ఓటుహక్కును వినియోగించుకోవాలన్నారు. స్వీప్ నోడల్ అధికారి ప్రభాకర్, అగ్నిమాపక అధికారి శ్రీనివాసరావు పాల్గొన్నారు.

కొనసాగిన నామినేషన్లు

భీమవరం (ప్రకాశంచౌక్): సార్వత్రిక ఎన్నికల్లో భాగంగా ఆరో రోజు బుధవారం నామినేషన్ల ప్రక్రియ కొనసాగింది. నరసాపురం పార్లమెంటరీ నియోజకవర్గానికి ఒక నామినేషన్ దాఖలైనట్టు జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ సుమిత్‌కుమార్ తెలిపారు. స్వతంత్ర అభ్యర్థిగా ఆనంద్ చందూలాల్ జాస్తి ఒక సెట్టు నామినేషన్ పత్రాలను అందించారన్నారు. నరసాపురం ఎంపీ స్థానానికి ఇప్పటివరకు 15 మంది అభ్యర్థులు 21 సెట్ల నామినేషన్లను దాఖలు చేశారు. జిల్లాలోని ఏడు అసెంబ్లీ నియోజకవర్గాల్లో బుధవారం 35 మంది అభ్యర్థులు 41 సెట్ల నామినేషన్లను దాఖలు చేశారు. ఆచంటలో నలుగురు అభ్యర్థులు ఐదు సెట్లు, పాలకొల్లులో ఆరుగురు అభ్యర్థులు ఎనిమిది సెట్లు, నరసాపురంలో ఐదుగురు అభ్యర్థులు ఏడు సెట్లు, భీమవరంలో ఒక అభ్యర్థి రెండు సెట్లు, ఉండిలో తొమ్మిది మంది అభ్యర్థులు తొమ్మిది సెట్లు, తణుకులో ఐదుగురు అభ్యర్థులు ఐదు సెట్లు, తాడేపల్లిగూడెంలో ఐదు మంది అభ్యర్థులు ఐదు సెట్లు నామినేషన్లను సమర్పించారు.

నేడు ప్రవేశ పరీక్షలు

ఏలూరు (ఆర్ఆర్‌పేట): ఆంధ్రప్రదేశ్ గురుకుల విద్యాలయాల్లో 5,6,7,8 తరగతుల్లో ప్రవేశాలకు ఏపీఆర్ఎస్ కామన్ అడ్మిషన్ టెస్ట్, ఆంధ్రప్రదేశ్ రెసిడెన్షియల్ జూనియర్ కళాశాలల్లో ఇంటర్మీడియెట్ మొదటి సంవత్సరంలో ప్రవేశాలకు ఏపీఆర్‌జేసీ, డిగ్రీ కళాశాలల్లో ప్రథమ సంవత్సరంలో ప్రవేశాలకు డీసీ సెట్ పరీక్షలు గురువారం నిర్వహించనున్నట్లు ఏలూరు డీఈఓ ఎస్.అబ్రహం ఓ ప్రకటనలో తెలిపారు. ఏపీఆర్ఎస్ సెట్‌కు 2,185 మంది, ఏపీఆర్‌జేసీకి 1,908 మంది, డీసీ సెట్‌కు 66 మంది అభ్యర్థులు హాజరవుతారని తెలిపారు.

వర్జీనియా అ'ధర'హో



జంగారెడ్డిగూడెంలో పొగాకు బేళ్లు

జంగారెడ్డిగూడెం: వర్జీనియా పొగాకు ధర కిలో రూ.287కు చేరుకుంది. గతేడాది అత్యధికంగా రికార్డు స్థాయిలో రూ.288 పలికింది. ఈ ఏడాది పొగాకు వేలం ప్రారంభమైన కొద్దిరోజులకే రూ.287కు చేరింది. మార్చి 6న ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లాలోని ఐదు వేలం కేంద్రాల్లో వేలం ప్రారంభమైంది. ప్రారంభ ధర కిలోకు రూ.240 లభించింది. ఇది క్రమేపీ పెరుగుతూ ఈనెల 20న రూ.266, 22న రూ.272కు చేరుకోగా, బుధవారం మరింత పెరిగింది. కొయ్యలగూడెం, గోపాలపురం వేలం కేంద్రాల్లో కిలోకు రూ.287 లభించగా, జంగారెడ్డిగూడెం–1వ కేంద్రంలో రూ.286, జంగారెడ్డిగూడెం–2వ కేంద్రంలో రూ.281, దేవరపల్లి కేంద్రంలో రూ.279 ధర లభించింది. రానున్న రెండు రోజుల్లో రూ.288 దాటి రికార్డు బ్రేక్ చేస్తుందని రైతులు ఆశాభావం వ్యక్తం చేస్తున్నారు. కిలో రూ.300కు వెళుతుందని అంచనా వేస్తున్నారు. ఇదిలా ఉంటే లోగ్రేడ్, మధ్యతరగతి గ్రేడ్ పొగాకుకు ధర బాగుందని, వెంటనే బేళ్లు వేలం కేంద్రాలకు తరలించి అమ్ముకోవాలని అధికారులు సూచిస్తున్నారు.

తుది దశకు నామినేషన్ల పర్వం

- నేటితో ముగియనున్న గడువు
- పార్లమెంట్ నియోజకవర్గానికి 15
- అసెంబ్లీ నియోజకవర్గాలకు 105 నామినేషన్లు
- 26న పరిశీలన
- 29 వరకు ఉపసంహరణకు గడువు



పాలకొల్లులో వైఎస్సార్‌సీపీ అభ్యర్థిగా నామినేషన్ దాఖలు చేస్తున్న గుడాల గోపి. చిత్రంలో ఎంపీ అభ్యర్థి గూడూరి ఉమాబాల

సాక్షి, భీమవరం: ఎన్నికల ప్రక్రియలో తొలి ఘట్టమైన నామినేషన్ల పర్వం తుది దశకు చేరుకుంది. గురువారంతో నామినేషన్ల దాఖలుకు గడువు ముగియనుంది. ఒక్కరోజు మాత్రమే గడువుండటంతో అభ్యర్థులు ఏర్పాట్లు చేసుకుంటున్నారు. బుధవారం నాటికి జిల్లాలో మొత్తం 120 నామినేషన్లు దాఖలయ్యాయి. వీటిలో ఎంపీ అభ్యర్థులుగా 15 మంది నామినేషన్లు వేయగా, జిల్లాలోని ఏడు అసెంబ్లీ స్థానాలకు 105 నామినేషన్లు వచ్చాయి. 2024 సార్వత్రిక ఎన్నికలకు సంబంధించి మార్చి 16న ఎన్నికల కమిషన్ షెడ్యూల్ విడుదల చేయడంతో ఎన్నికల వాతావరణం వేడెక్కింది. ఈనెల 18న గెజిట్ నోటిఫికేషన్ రాగా జిల్లాలోని ఒక ఎంపీ, ఏడు అసెంబ్లీ స్థానాలకు నామినేషన్ల ప్రక్రియ మొదలైంది. ఈనెల 25 వరకు నామినేషన్ల స్వీకరణ, 26న పరిశీలన, 29 వరకు ఉపసంహరణకు ఈసీ గడువు ఇచ్చింది. మే 13న పోలింగ్, జూన్ 4న కౌంటింగ్ నిర్వహించనున్నారు. ముహూర్త బలం కుదరడంతో ఈనెల 19, 22, 24 తేదీల్లో అత్యధికంగా నామినేషన్లు దాఖలయ్యాయి. ప్రధాన రాజకీయ పార్టీల అభ్యర్థులకు డమ్మీలుగా పలుచోట్ల వారి కుటుంబ సభ్యులు నామినేషన్లు వేశారు. కొందరు ఆఖరి రోజు గురువారం నామినేషన్ సమర్పణకు సన్నాహాలు చేసుకున్నారు.

నేడు మంత్రి కొట్టు నామినేషన్ : తాడేపల్లిగూడెం నుంచి వైఎస్సార్‌సీపీ అభ్యర్థిగా మంత్రి కొట్టు సత్యనారాయణ గురువారం నామినేషన్ దాఖలు చేయనున్నారు. పెద్ద ఎత్తున పార్టీ శ్రేణులతో కలిసి ఆర్‌ఓ కార్యాలయం వరకు ర్యాలీగా వెళ్లేందుకు ఏర్పాట్లు చేస్తున్నారు. ఇప్పటికే ప్రధాన రాజకీయ పార్టీలు ప్రకటించిన అభ్యర్థుల నామినేషన్ల ప్రక్రియ దాదాపు పూర్తయ్యింది. ఎన్నికల్లో పోటీ చేయాలనుకుంటున్న ఆశావాహులు నామినేషన్లకు చివరి రోజు కావడంతో సన్నాహాలు చేసుకుంటున్నారు.

రిటర్నింగ్ అధికారులకు సమర్పించిన నామినేషన్లను ఆయా పార్లమెంట్ నియోజకవర్గం, అసెంబ్లీ నియోజకవర్గాల వారీగా ఈనెల 26న (శుక్రవారం) పరిశీలిస్తారు. వాటిలో ఏమైనా లోపాలు ఉంటే తిరస్కరిస్తారు. నామినేషన్ల ఉపసంహరణకు 29వ తేదీ వరకు గడువుంది. అభ్యర్థులకు డమ్మీగా వేసిన నామినేషన్లను ఈలోపు ఉపసంహరించుకోవాల్సి ఉంది. అనంతరం ఎన్నికల బరిలో ఎంతమంది నిలిచేది లెక్క తేలనుంది. రాజకీయ పార్టీల తరఫున బీఫారంలు అందజేసిన అభ్యర్థులకు ఆయా పార్టీలకు సంబంధించి గుర్తులు కేటాయిస్తారు. మిగిలిన అభ్యర్థులను స్వతంత్రులుగా పరిగణించి ఈసీ మార్గదర్శకాలు మేరకు గుర్తుల కేటాయింపు చేస్తారు. అనంతరం అభ్యర్థులు ఎన్నికల ప్రచారం మరింత జోరందుకుంటుంది.

8 స్థానాలు.. 120 నామినేషన్లు

జిల్లాలో బుధవారం ఒక్కరోజే ఎంపీ స్థానానికి 1, అసెంబ్లీ స్థానాలకు 35 నామినేషన్లు వచ్చాయి. మొత్తంగా జిల్లాలో 120 నామినేషన్లు దాఖలయ్యాయి.

- నరసాపురం పార్లమెంట్ నియోజకవర్గ స్థానానికి ఇప్పటివరకు 15 నామినేషన్లు రాగా ప్రధాన రాజకీయ పార్టీలైన వైఎస్సార్‌సీపీ అభ్యర్థిగా గూడూరి ఉమాబాల, బీజేపీ అభ్యర్థిగా భూపతిరాజు శ్రీనివాసవర్మ, ఇతర పార్టీలు, స్వతంత్ర్య అభ్యర్థులు నామినేషన్లు వేశారు.
- భీమవరం అసెంబ్లీ నియోజకవర్గానికి 11 నామినేషన్లు వచ్చాయి. వైఎస్సార్ సీపీ అభ్యర్థిగా సిట్టింగ్ ఎమ్మెల్యే గ్రంధి శ్రీనివాస్, జనసేన పార్టీ అభ్యర్థిగా మాజీ ఎమ్మెల్యే పులపర్తి రామాంజనేయులు, ఇతర స్వతంత్ర అభ్యర్థులు నామినేషన్లు వచ్చాయి.
- ఉండి నియోజకవర్గంలో 21 నామినేషన్లు రాగా వైఎస్సార్‌సీపీ అభ్యర్థిగా పీవీఎల్ నరసింహరాజు, టీడీపీ అభ్యర్థిగా కనుమూరి రఘురామకృష్ణంరాజు, స్వతంత్ర్య అభ్యర్థిగా మాజీ ఎమ్మెల్యే వేటుకూరి శివరామరాజు నామినేషన్ వేసిన వారిలో ఉన్నారు.
- ఆచంట నియోజకవర్గంలో 10 నామినేషన్లు రాగా వైఎస్సార్‌సీపీ అభ్యర్థిగా సిట్టింగ్ ఎమ్మెల్యే చెరుకువాడ శ్రీరంగనాథరాజు, టీడీపీ అభ్యర్థిగా పితాని సత్యనారాయణ నామినేషన్లు వేశారు.
- తణుకులో 15 నామినేషన్లు రాగా వీటిలో వైఎస్సార్‌సీపీ అభ్యర్థిగా మంత్రి కారుమూరి వెంకట నాగేశ్వరరావు, టీడీపీ నుంచి ఆరిమిల్లి రాధాకృష్ణ నామినేషన్లు వేశారు.
- నరసాపురంలో 10 నామినేషన్లు రాగా వైఎస్సార్‌సీపీ అభ్యర్థిగా సిట్టింగ్ ఎమ్మెల్యే ముదునూరి ప్రసాదరాజు, జనసేన పార్టీ అభ్యర్థిగా బొమ్మిడి నాయకర్, స్వతంత్ర్య అభ్యర్థులు నామినేషన్లు వేశారు.
- పాలకొల్లు నుంచి 12 నామినేషన్లకు గాను టీడీపీ అభ్యర్థిగా సిట్టింగ్ ఎమ్మెల్యే నిమ్మల రామానాయుడు నామినేషన్ వేయగా బుధవారం వైఎస్సార్‌సీపీ అభ్యర్థి గుడాల గోపి భారీ ర్యాలీగా ఆర్‌ఓ కార్యాలయానికి వెళ్లి నామినేషన్ వేశారు.
- తాడేపల్లిగూడెంలో 12 నామినేషన్లకు గాను జనసేన పార్టీ అభ్యర్థిగా బొలిశెట్టి శ్రీనివాస్ నామినేషన్ వేశారు.

క్లుప్తంగా

పెళ్లింట విషాదం

- రోడ్డుపై గేదె కళేబరాన్ని ఢీకొన్న కారు
- ఘటనా స్థలంలో వధువు తల్లి మృతి

బంటుమిల్లి: మండలంలోని పెందుర్రు గ్రామం వద్ద 216 జాతీయ రహదారిపై బుధవారం తెల్లవారుజామున జరిగిన రోడ్డు ప్రమాదం ఓ పెళ్లింట విషాదాన్ని నింపింది. ప్రమాదంలో వధువు తల్లి మృతి చెందగా, వధువుకు తీవ్ర గాయాలయ్యాయి. పోలీసుల కథనం మేరకు.. నరసాపురం పట్టణానికి చెందిన కైకాల చంద్రలీల (61) కుమార్తె అనూష వివాహాన్ని నరసాపురంలో జరిపించేందుకు ఏర్పాట్లు చేసుకున్నారు. ఈ క్రమంలో మంగళవారం రాత్రి తల్లీకూతుళ్లు కారులో విజయవాడ నుంచి నరసాపురానికి బయల్దేరారు. ఈ క్రమంలో జాతీయ రహదారిపై పెందుర్రు వద్ద రోడ్డుపై మృతి చెంది ఉన్న గేదెను గమనించని కారు డ్రైవర్ వేగంగా వెళ్లి ఢీకొట్టారు. దీంతో కారు అదుపుతప్పి రోడ్డు మార్జిన్‌లో పల్టీ కొట్టింది. ఈ ఘటనలో చంద్రలీల అక్కడికక్కడే మరణించగా, తీవ్రంగా గాయపడిన అనూష, డ్రైవర్ లోకేష్‌ను పోలీసుల సాయంతో 108 వాహనం ద్వారా మచిలీపట్నం ఆసుపత్రికి తరలించారు. ఈ మేరకు ఏఎస్సై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. రెండురోజుల్లో శుభ కార్యం జరగాల్సి ఉండగా చంద్రలీల మృతితో ఆ కుటుంబంలో విషాదం నెలకొంది.

గడువు ముగిసినా తొలగించని సైకిల్ సింబల్



ఆర్‌ఓ కార్యాలయం సమీపంలో ఉన్న టీడీపీ సైకిల్ గుర్తు

పాలకొల్లు సెంట్రల్: నియోజకవర్గంలో ఎక్కడైనా సీఎం వైఎస్ జగన్ ఫొటో ఉంటే చాలు భూతద్దంలో చూపి ఎన్నికల సంఘానికి ఫిర్యాదులు చేస్తున్న ప్రతిపక్ష కూటమి నేతలకు మాత్రం వారి తప్పులు కనిపించడంలేదు. ఎన్నికల రిటర్నింగ్ అధికారి కార్యాలయానికి అతి సమీపంలో సుమారు 100 మీటర్ల దూరంలో ఓ భవనంపై సైకిల్ గుర్తుకే మీ ఓటు అంటూ ఓ సైకిల్ సింబల్‌ను ఏర్పాటు చేశారు. ఇటీవల చంద్రబాబు పాలకొల్లు వచ్చినప్పుడు పట్టణంలో 4 చోట్ల సైకిల్ సింబల్స్‌ను ఏర్పాటు చేశారు. 17వ తేదీతో గడువు ముగిసినా వీటిని తొలగించలేదు. దీనిపై అధికారులను వివరణ కోరగా, ఆ సైకిల్ సింబల్స్‌కు అనుమతించిన గడువు ముగిసిందని, రెండు సార్లు తామే తొలగించామని, అయినా మళ్లీ వాటిని ఏర్పాటు చేస్తున్నారని అధికారులు తెలిపారు.

పేదల సంక్షేమమే జగన్ అజెండా

- మంత్రి కారుమూరి నాగేశ్వరరావు
- తణుకు 13వ వార్డులో విస్తృతంగా ఎన్నికల ప్రచారం



తణుకు 13వ వార్డు ప్రచారంలో వృద్ధురాలిని ఆప్యాయంగా పలుకరిస్తున్న మంత్రి కారుమూరి

తణుకు అర్బన్ : వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి మళ్లీ సీఎం అయితేనే సంక్షేమ పథకాలు పారదర్శకంగా అందుతాయని ప్రజలు నమ్ముతున్నారని తణుకు ఎమ్మెల్యే అభ్యర్థి, మంత్రి కారుమూరి వెంకట నాగేశ్వరరావు అన్నారు. పట్టణంలోని ఇరగవరం కాలనీలోని 13వ వార్డులో బుధవారం నిర్వహించిన ఎన్నికల ప్రచారంలో ఆయన పాల్గొని మాట్లాడారు. చంద్రబాబు మూడు పార్టీల పొత్తుతో ప్రజల్ని మాయచేసేందుకు మీముందుకు వస్తున్నాడని ప్రజలు నమ్మవద్దన్నారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రజలతోనే పొత్తు పెట్టుకుని దేవుడి ఆశీర్వచనాలతో మీమధ్యకు వస్తున్నారని అన్నారు. చంద్రబాబు 14 ఏళ్లు ముఖ్యమంత్రిగా ఉన్న సమయంలో ఈ సంక్షేమం ఎందుకు ఇవ్వలేకపోయాడని, జగనన్న ఇచ్చిన తరువాత ఇప్పుడు నేను కూడా ఇస్తానని చెప్పడాన్ని ప్రజలు నమ్మేస్థితిలో లేరన్నారు. ప్రజాక్షేత్రంలో ప్రజలకు ఏం మంచి చేశాడని చెబుతాడని, ఏమీ చెప్పలేని స్థితిలో దత్తపుత్రుడితో కలిసి జగనన్నను దూషించడమే పనిగా పెట్టుకున్నాడని విమర్శించారు. పేదలకు మంచి చేసినందుకు ముఖ్యమంత్రిని అనరాని మాటలు అంటున్నారని ప్రజలు గమనిస్తున్నారని స్పష్టం చేశారు. ఓటు అడిగేందుకు ప్రజల మధ్యకు వస్తుంటే జగనన్నకు నీరాజనాలు పడుతున్నారని, చేసిన మంచి ఎక్కడకు పోదనడానికి ఇదే నిదర్శనమని అన్నారు. పేదల శ్రేయస్సు కోసం చంద్రబాబు లాంటి పెత్తందార్లతో పోరాడుతున్న మీ జగనన్నకు అండగా నిలబడాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఏఎంసీ మాజీ చైర్మన్ చిట్టూరి శ్రీవెంకట సుబ్బారావు, నియోజకవర్గ ఎస్సీ సెల్ అధ్యక్షులు పాట్ల సురేష్, నత్తా భాను, సామంతుల అప్పారావు, దొరబాబు, దిడ్ల సత్యానందం, నత్తా గంగవర్ధన రావు, అప్పన్న, కుడుపూడి చంద్రరావు, అనపర్తి జయరాజు తదితరులు పాల్గొన్నారు.

ప్రతి కుటుంబానికీ పథకాల లబ్ధి

నత్తారామేశ్వరం ప్రచారంలో ఎమ్మెల్యే చెరుకువాడ, ఎంపీ అభ్యర్థిని ఉమాబాల



నత్తారామేశ్వరంలో ప్రచారం చేస్తున్న ఎమ్మెల్యే శ్రీరంగనాథరాజు, ఎంపీ అభ్యర్థిని గూడూరి ఉమాబాల

పెనుమంట్ర: అర్హత ఉన్న ప్రతి కుటుంబానికీ సంక్షేమ పథకాలు అందించిన వైఎస్సార్‌సీపీ పాలనపై ప్రజల నుంచి విశేష స్పందన లభిస్తోందని మాజీ మంత్రి, వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు చెరుకువాడ శ్రీరంగనాథరాజు అన్నారు. బుధవారం పెనుమంట్ర మండలం నత్తారామేశ్వరం గ్రామంలో ఎంపీ అభ్యర్థిని గూడూరి ఉమాబాలతో కలిసి ఎన్నికల ప్రచారం నిర్వహించారు. శ్రీరంగనాథరాజు, ఉమాబాల మాట్లాడుతూ రాష్ట్రాన్ని అన్నివిధాలా అభివృద్ధి చేసి, పేదలు ఆర్థికంగా నిలదొక్కుకోవడానికి కృషి చేసిన వైఎస్సార్ సీపీ ప్రభుత్వాన్ని వచ్చే ఎన్నికలలో మరోసారి ఫ్యాన్ గుర్తుకే రెండు ఓట్లు వేసి గెలిపించాలని ఓటర్లను అభ్యర్థించారు. సీనియర్ పార్టీ నాయకులు ద్వారంపూడి శ్రీనివాస రెడ్డి, కర్రి రామలింగేశ్వరరెడ్డి, తమనంపూడి అయ్యప్పరెడ్డి నాయకత్వంలో శ్రీరంగనాథరాజు, ఉమాబాలకు ఘనస్వాగతం పలికారు. రాష్ట్ర హౌసింగ్ కార్పొరేషన్ చైర్‌పర్సన్ మేడపాటి షర్మిలారెడ్డి, ఎంపీపీ కర్రి వెంకట నారాయణరెడ్డి, జెడ్పీటీసీ కర్రి గౌరీసుభాషిణి, ఏఎంసీ చైర్‌పర్సన్ వెలగల వెంకటరమణ, డైరెక్టర్ కర్రి రామారెడ్డి, సర్పంచ్ వెలగల ధర్మారెడ్డి, మాజీ సర్పంచ్ చవాకుల లక్ష్మి, ఉపసర్పంచ్ మల్లిడి కిరణ్‌కుమార్‌రెడ్డి, మాజీ ఉప సర్పంచ్ ద్వారంపూడి సత్యనారాయణరెడ్డి పాల్గొన్నారు.



సీతారామపురం సౌత్ గ్రామంలో ఓట్లు అభ్యర్థిస్తున్న చీఫ్ విప్ ముదునూరి ప్రసాదరాజు

సంక్షేమ ప్రభుత్వాన్ని గెలిపించండి

సీతారామపురం ప్రచారంలో చీఫ్ విప్ ముదునూరి ప్రసాదరాజు

నరసాపురం రూరల్: రాష్ట్రంలో పేదల సంక్షేమమే ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అజెండా అని రాష్ట్ర ప్రభుత్వ చీఫ్ విప్, స్థానిక ఎమ్మెల్యే ముదునూరి ప్రసాదరాజు అన్నారు. బుధవారం నరసాపురం మండలంలోని సీతారామపురం గ్రామంలో ఎన్నికల ప్రచారాన్ని నిర్వహించారు. వేకువజాము నుంచే గ్రామస్తులతో మాట్లాడుతూ ప్రచారం నిర్వహించారు. అందరినీ పలుకరిస్తూనే తమ ప్రభుత్వాన్ని ఎందుకు మళ్లీ గెలిపించాలో వివరిస్తూ ముందుకు సాగారు. ఈ సందర్భంగా ఆయన ఇంటింటికీ వెళ్లి సంక్షేమ ప్రభుత్వానికి అండగా నిలవాలని కోరారు. మే 13న జరగనున్న ఎన్నికల్లో ఫ్యాన్ గుర్తుపై రెండు ఓటు వేసి తనను, ఎంపీ అభ్యర్థి ఉమాబాలను గెలిపించాలని అభ్యర్థించారు. గ్రామంలో పలు చోట్ల ఆయన మాట్లాడుతూ రాజకీయాలు, కులమతాలకు అతీతంగా పేదలందరికీ సంక్షేమ పథకాలు అందించిన ఘనత సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికే దక్కుతుందని, ఆయన అందించిన సుపరిపాలనకు ప్రజలు మద్దతివ్వాలన్నారు. సంక్షేమ పథకాలు కొనసాగాలంటే వైఎస్ జగన్‌ను మళ్లీ సీఎం చేసుకోవాలన్నారు. ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలను కచ్చితంగా అమలు చేసి ప్రజా మన్ననలు పొందిన వ్యక్తి సీఎం జగన్ అన్నారు. ప్రజలకు మంచి చేస్తున్న వైఎస్సార్ ప్రభుత్వానికి అండగా ఉండాలన్నారు. ప్రజల్లో జగనన్నకు ఆదరణ పెరుగుతున్న తరుణంలో దుష్టచతుష్టయం ఓర్వలేకపోతోందన్నారు. గడప గడపకూ వెళ్లి ఓట్లు అభ్యర్థిస్తూ ఎన్నికల ప్రచార కరపత్రాలను అందజేశారు. రానున్న ఎన్నికల్లో ఫ్యాన్ గుర్తుకు ఓటు వేసి వైఎస్సార్ సీపీని భారీ మెజార్టీతో గెలిపించాలని కోరారు. ఈ ప్రచారంలో జెడ్పీటీసీ సభ్యులు బొక్కా రాధాకృష్ణ, దొంగ మురళీకృష్ణ, జేవీఆర్, బ్రహ్మాజీ, కస్తూరి రంగ, అడబాల అయ్యప్ప, సయ్యపరాజు వర్మ, చెరుకూరి ప్రసాదరాజు, సయ్యపరాజు శ్రీనివాసరాజు, వాకా సుందరమ్మ, గుంపుల మూర్తిరాజు, పలు గ్రామాలకు చెందిన ప్రజా ప్రతినిధులు, పార్టీ నాయకులు పాల్గొన్నారు.



కలిసిపూడిలో బైక్ ర్యాలీ, ప్రచారం చేస్తున్న ఉండి వైఎస్సార్‌సీపీ ఎమ్మెల్యే అభ్యర్థి పీవీఎల్

సంక్షేమానికి మారుపేరు వైఎస్ జగన్

ఉండి వైఎస్సార్ సీపీ ఎమ్మెల్యే అభ్యర్థి పీవీఎల్

ఉండి: ప్రజాసేవకు, సంక్షేమానికి మారుపేరు సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అని ఉండి వైఎస్సార్ సీపీ ఎమ్మెల్యే అభ్యర్థి పీవీఎల్ నర్సింహరాజు అన్నారు. బుధవారం మండలంలోని అర్తమూరు, చెరుకువాడ, కలసిపూడి గ్రామాల్లో బైక్, కార్ ర్యాలీ ద్వారా పీవీఎల్ ఎన్నికల ప్రచారాన్ని హోరెత్తించారు. ఈ సందర్భంగా ఆయా గ్రామాల్లో పీవీఎల్‌కు ప్రజలు హారతులు పట్టి అపూర్వ స్వాగతం పలికారు. ఫ్యాన్ గుర్తుకు మీ రెండు ఓట్లు వేయాలంటూ పీవీఎల్ ప్రజలను కోరారు. కలసిపూడిలో సీబీసీఎన్‌సీ చర్చిలో ప్రత్యేక ప్రార్థనలు చేశారు. కలిసిపూడిలో భ్రమరాంబ మల్లికార్జునస్వామికి పీవీఎల్ ప్రత్యేక పూజలు చేశారు. ఈ సందర్భంగా పీవీఎల్ మాట్లాడుతూ ప్రజలకు మేలు చేయాలంటే వైఎస్ జగన్ వల్లే సాధ్యమని ప్రజలు నమ్ముతున్నారన్నారు. చంద్రబాబు, పవన్ ఎన్ని మాయమాటలు చెప్పినా నమ్మేందుకు ప్రజలు సిద్ధంగా లేరన్నారు. ఈ ఎన్నికల్లో ఉండిలో వైఎస్సార్‌సీపీ జెండా ఎగరడం ఖాయమని, దీనిని ఎవ్వరూ అడ్డుకోలేరన్నారు. సర్పంచ్‌లు కేశబోయిన జానకీ శ్రీనివాస్, కొండవేటి సాంబశివరావు, జెడ్పీటీసీ సభ్యులు రణస్తుల కనకదుర్గ మహంకాళి, పార్టీ మండలాధ్యక్షుడు పీవీఆర్‌కే ఆంజనేయరాజు, కానుబోయిన సత్యనారాయణ, కొండవేటి సత్యనారాయణ,రాష్ట్ర కార్పొరేషన్ డైరెక్టర్లు కొరపాటి అనిత, గులిపల్లి అచ్చారావు, మునుకోలు సింహాచలం పాల్గొన్నారు.

ఏపీలో ఉద్యాన పంటలు భేష్



మాట్లాడుతున్న వర్సిటీ వీసీ టి.జానకీరామ్

ఐసీఏఆర్ డైరెక్టర్, అటారీజోన్ నిర్దేశకులు షేక్ ఎన్ మీరా

తాడేపల్లిగూడెం: ఆంధ్రప్రదేశ్‌లో ఉద్యాన పంటలు బాగున్నాయని ఐసీఏఆర్ డైరెక్టర్ అటారీజోన్ నిర్దేశకులు డాక్టర్ షేక్ ఎన్ మీరా అన్నారు. వెంకట్రామన్నగూడెంలోని ఉద్యాన విశ్వవిద్యాలయంలో బుధవారం ఉద్యాన, కీటక విభాగ శాస్త్రవేత్తలకు నూతన సాంకేతిక పద్ధతులపై శిక్షణా కార్యక్రమం ప్రారంభమైంది. వర్చువల్‌గా హాజరైన మీరా మాట్లాడుతూ రాష్ట్రంలో ఉద్యాన పంటల అభివృద్ధి సరళి బాగుందన్నారు. కేవీకేల ద్వారా ఉద్యాన పంటలైన పండ్లు, కూరగాయలు, తోట పంటలలో నూతన విధి విధానాలను రైతులకు అందించాలన్నారు. వీసీ టి.జానకీరామ్ మాట్లాడుతూ డ్రోన్ టెక్నాలజీ, నర్సరీ యాజమాన్యం, జీవ నియంత్రణ కారకాల ఉత్పత్తి, నిమ్మ, మిరప, కొబ్బరి, సేంద్రియ సాగు అంశాలను వివరించారు. పరిశోధనా సంచాలకులు ఎల్.నారం నాయుడు మాట్లాడుతూ విశ్వవిద్యాలయ పరిధిలోని 20 పరిశోధనా స్థానాల ద్వారా ఉద్యాన పంటలపై జరుగుతున్న పరిశోధన ఫలితాలను కేవీకే శాస్త్రవేత్తల ద్వారా క్షేత్రస్థాయికి తీసుకెళ్లాలన్నారు. విస్తరణ సంచాలకులు ఇ.కరుణశ్రీ మాట్లాడారు. రాష్ట్రం నుంచి 24 కేవీకేల శాస్త్రవేత్తలు, వెంకట్రామన్నగూడెం కేవీకే శాస్త్రవేత్తలు వి.దీప్తి, దేవీవరప్రసాదరెడ్డి, రాఘవేంద్రరెడ్డి, కె.వెంకటసతీష్ పాల్గొన్నారు.

అత్యాచారయత్నం కేసులో వ్యక్తికి ఐదేళ్ల జైలు

ఏలూరు (టూటౌన్): వివాహితపై అత్యాచారయత్నానికి పాల్పడిన కేసులో నేరం రుజువు కావడంతో నిందితుడికి ఐదేళ్ల జైలు శిక్ష, రూ.1,500 జరిమానా విధిస్తూ ఏలూరు ఐదో అదనపు జిల్లా జడ్జి, మహిళా కోర్టు న్యాయమూర్తి జి.రాజేశ్వరి బుధవారం తీర్పు వెలువరించారు. ఏపీపీ డీవీ రామాంజనేయులు తెలిపిన వివరాలిలా ఉన్నాయి. పశ్చిమగోదావరి జిల్లా వీరవాసరం మండలం బలుసుగొయ్యిపాలెంకు చెందిన దొంగ రమేష్ 2017 సెప్టెంబర్ 10న మధ్యాహ్నం ఇంట్లో ఒంటరిగా నిద్రిస్తున్న వివాహితపై దాడి చేసి అత్యాచారం చేసేందుకు ప్రయత్నించాడు. ఆమె కేకలు వేయడంతో చుట్టుపక్కల వారు రాగా నిందితుడు దొంగ రమేష్ పరారయ్యాడు. దీనిపై బాధితురాలు, కుటుంబ సభ్యులు గ్రామ పెద్దలకు మొరపెట్టుకున్నారు. నిందితుడు పెద్దల వద్ద పంచాయితీకి రాకపోవడంతో బాధితురాలు ఇచ్చిన ఫిర్యాదుపై వీరవాసరం పోలీస్‌స్టేషన్‌లో అప్పటి ఎస్సై ఎన్.శ్రీనివాసరావు కేసు నమోదు చేశారు. ఈ కేసు విచారణకు వీరవాసరం ఎస్సై పి.రమేష్, కోర్టు కానిస్టేబుల్ వి.ఏసుబాబు, నానిబాబు సహకరించారు. ఏపీపీ డీవీ రామాంజనేయులు వాదనలు వినిపించారు.

వైఎస్సార్ సీపీలోకి వలసల వరద



వైఎస్సార్ సీపీలో చేరిన టీడీపీ, జనసేన యువకులతో ప్రభుత్వ చీఫ్ విప్ ముదునూరి ప్రసాదరాజు



భీమవరంలో వైఎస్సార్ సీపీలో చేరిన వారికి పార్టీ కండువా వేసి ఆహ్వానిస్తున్న ఎమ్మెల్యే శ్రీనివాస్



కండువా కప్పి వైఎస్సార్ సీపీలోకి ఆహ్వానిస్తున్న ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే గ్రంధి శ్రీనివాస్



నరసాపురం సీనియర్ టీడీపీ నేత షాన్‌వాజ్‌ఖాన్‌ను పార్టీలోకి ఆహ్వానిస్తున్న ముదునూరి ప్రసాదరాజు



ఆటపాకలో కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానిస్తున్న ఎమ్మెల్యే డీఎన్నార్

నరసాపురం: వైఎస్సార్ సీపీతోనే రాష్ట్రాభివృద్ధి, సంక్షేమం సాధ్యమని ప్రభుత్వ చీఫ్ విప్ ముదునూరి ప్రసాదరాజు అన్నారు. పట్టణానికి చెందిన సీనియర్ టీడీపీ నేత షాన్‌వాజ్‌ఖాన్ బుధవారం ముదునూరి సమక్షంలో అనుచరులతో కలిసి వైఎస్సార్ సీపీలో చేరారు. వీరికి పార్టీ కండువా కప్పి ముదునూరి పార్టీలోకి ఆహ్వానించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ గతంలో వామపక్ష పార్టీల్లో కూడా పనిచేసిన షాన్‌వాజ్‌ఖాన్ లాంటి నేత పార్టీలోకి రావడం ఆనందంగా ఉందన్నారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పాలనలో అన్ని వర్గాలు అభివృద్ధి చెందాయన్నారు. కరోనా లాంటి కష్టాలు ఎదురైనా కూడా జగన్ రాజీపడకుండా అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలు పెద్ద ఎత్తున చేపట్టారన్నారు. ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీల అభ్యున్నతికి ఈ ఐదేళ్లపాటు విశేష కృషి చేశారని అన్నారు. పేదలకు సంక్షేమ పథకాలు అందాలన్నా, రాష్ట్రం అన్ని రంగాల్లో ముందుండాలంటే మళ్లీ వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని ముఖ్యమంత్రిని చేసుకోవాలని చెప్పారు. ఈ కార్యక్రమంలో పార్టీ కేంద్ర పాలక మండలి సభ్యుడు పీడీ రాజు, నరసాపురం సొసైటీ అధ్యక్షుడు షేక్ బులిమస్తాన్, బుడితి సుమన్ ఉన్నారు.

నరసాపురం 28వ వార్డు యువకుల చేరిక

పట్టణంలోని 28వ వార్డు నుంచి టీడీపీ, జనసేన పార్టీలకు చెందిన 50 మంది యువకులు ఎమ్మెల్యే ముదునూరి సమక్షంలో బుధవారం వైఎస్సార్ సీపీలో చేరారు. వీరికి పార్టీ కండువాలు కప్పి వారిని పార్టీలోకి ఆహ్వానించారు. యువత పార్టీకి వెన్నుముకలా నిలబడాలని ముదునూరి సూచించారు. పార్టీలో చేరిన వారిలో చిన్న, వెంకటేష్, విజయ్, శ్రీను, వెంకన్న, పండు ఉన్నారు. పార్టీ యూత్ విభాగం జిల్లా ఉపాధ్యక్షుడు చదలవాడ మెర్లిన్, పట్టణ యూత్ అధ్యక్షుడు ఆబోతు అర్జున్‌కుమార్ ఆధ్వర్యంలో ఈ చేరికలు జరిగాయి.

అభివృద్ధి, సంక్షేమానికి పట్టం కట్టండి

భీమవరం: సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పాలనలో జరిగిన అభివృద్ధి, సంక్షేమానికి పట్టం కట్టాలని ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే గ్రంధి శ్రీనివాస్ పిలుపునిచ్చారు. బుధవారం పట్టణంలోని 4వ వార్డుకు చెందిన టీడీపీ, జనసేన నాయకులు, కార్యకర్తలు వార్డు మాజీ కౌన్సిలర్ పేరిచర్ల సత్యనారాయణరాజు ఆధ్వర్యంలో స్థానిక క్యాంపు కార్యాలయంలో శ్రీనివాస్ సమక్షంలో వైఎస్సార్సీపీలో చేరారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే శ్రీనివాస్ మాట్లాడుతూ తన హయాంలోనే భీమవరం నియోజకవర్గ అభివృద్ధి జరిగిందన్నారు. తాను చేసిన అభివృద్ధి పనులు ల్యాండ్ మార్క్‌గా ప్రజలకు కనిపిస్తున్నాయన్నారు. ఇదే నియోజకవర్గంలో పదేళ్లపాటు ఎమ్మెల్యేగా పనిచేసి, ప్రస్తుతం జనసేన అభ్యర్థిగా పోటీలో ఉన్న పులపర్తి రామాంజనేయులు చేసిన అభివృద్ధి ఏమిటో చెప్పాలని శ్రీనివాస్ సవాల్ చేశారు. 2004 ఎమ్మెల్యేగా ఎన్నికైన తాను 126 ఎకరాల భూమిని సేకరించి 60 ఎకరాలలో మహానేత వైఎస్సార్ ప్రోత్సాహంతో రూ.9 కోట్ల ఖర్చుతో భారీ మంచినీటి ప్రాజెక్టును ఏర్పాటుచేసి పట్టణానికి తాగునీటి ఇబ్బంది లేకుండా చేయగలిగానన్నారు. అమృత పథకం మూడో విడతలో రూ.48 కోట్ల నిధులను మంజూరు చేయించి పక్కా ప్రణాళికను సిద్ధం చేసినట్లు చెప్పారు. సీఎం వైఎస్ జగన్ ప్రోత్సాహంతో గడిచిన 58 నెలల కాలంలో నియోజకవర్గంలో సుమారుగా 15 వేల మందికి పైగా ఇళ్ల స్థలాలను మంజూరు చేసి రిజిస్ట్రేషన్ చేసిన పట్టాలను అందించామన్నారు. పట్టణంలో ట్రాఫిక్ సమస్య పరిష్కారానికి రైల్వే అండర్ టన్నెల్స్‌ను నిర్మించినట్లు చెప్పారు. జనసేన అభ్యర్థి అంజిబాబు మంచినీటి పథకం పేరుతో చినఅమిరంలో 50 ఎకరాల భూమిని రైతుల నుంచి తక్కువ ధరకు సేకరించి సొంతానికి రిజిస్ట్రేషన్ చేయించుకున్నారని వెల్లడించారు. ఈ కార్యక్రమంలో నియోజకవర్గ పరిశీలకులు మోటుపల్లి గంగాధరరావు పాల్గొన్నారు.

వీరవాసరం టీడీపీ, జనసేన నాయకుల చేరిక

భీమవరం: వైఎస్సార్ సీపీలో చేరి ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్ రెడ్డి ఆధ్వర్యంలో ప్రజలకు సేవలు అందించాలని ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే గ్రంధి శ్రీనివాస్ అన్నారు. వీరవాసరానికి చెందిన టీడీపీ, జనసేన నాయకులు బుధవారం రాత్రి స్థానిక క్యాంపు కార్యాలయంలో ఎమ్మెల్యే గ్రంధి శ్రీనివాస్ సమక్షంలో వైఎస్సార్ సీపీలో చేరారు. వీరిని సాదరంగా పార్టీలోకి ఆహ్వానించిన ఎమ్మెల్యే గ్రంధి శ్రీనివాస్ మాట్లాడుతూ అభివృద్ధి సంక్షేమానికి ప్రజలు మరోసారి పట్టం కట్టాలని పిలుపునిచ్చారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి ప్రజల కోసం ఒక మాట ఇస్తే దానికి కట్టుబడి పనిచేస్తారని, ఇందులో ఎటువంటి సందేహం లేదని ఈ 58 నెలల పరిపాలనలో నిరూపించారన్నారు. అదే మాదిరిగా ఈనెల 25వ తేదీన ప్రజా ఎన్నికల మేనిఫెస్టోను ముఖ్యమంత్రి జగన్‌మోహన్ రెడ్డి విడుదల చేస్తున్నారని తెలిపారు. వీరవాసరం సర్పంచ్ చికిలే మంగతాయారు, నూకల కనకారావు, మానుకొండ ప్రదీప్, కందుల సురేష్ తదితరులు పాల్గొన్నారు.

నత్తారామేశ్వరంలో చేరికలు

పెనుమంట్ర: నత్తారామేశ్వరం గ్రామంలో బుధవారం నిర్వహించిన ఎన్నికల ప్రచార పాదయాత్రకు జనం నీరాజనాలు పలికారు. ఈ సందర్భంగా తెలుగుదేశం పార్టీకి చెందిన సీనియర్ నాయకుడు మల్లిడి సత్యనారాయణరెడ్డి, కరుణ దంపతులు ఎమ్మెల్యే శ్రీరంగనాథరాజు సమక్షంలో వైఎస్సార్ సీపీలో చేరి ప్రచార పాదయాత్రలో పాల్గొన్నారు. గ్రామానికి చెందిన సీనియర్ నాయకుడు ద్వారంపూడి శ్రీనివాసరెడ్డి నాయకత్వంలో యువత వైఎస్సార్‌సీపీకి అండగా నిలిచి ప్రచార యాత్రలో పాల్గొన్నారు.

ఆటపాకలో 200 మంది టీడీపీ, జనసేన కార్యకర్తల చేరిక

కైకలూరు: ఎన్నికల్లో వైఎస్సార్ సీపీ విజయం తథ్యమని కైకలూరు ఎమ్మెల్యే దూలం నాగేశ్వరరావు (డీఎన్నార్) అన్నారు. ఆటపాకలో పార్టీ తరపున డీఎన్నార్ సతీమణి దూలం వీరకుమారి బుధవారం ఎన్నికల ప్రచారం నిర్వహించారు. టీడీపీ, జనసేనకు చెందిన 200 మంది కార్యకర్తలు డీఎన్నార్ సమక్షంలో వైఎస్సార్‌సీపీలో చేరారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ వైఎస్సార్ సీపీ ఆదర్శవంతమైన పాలనకు ఆకర్షితులై పలు పార్టీలకు చెందిన నాయకులు, కార్యకర్తలు వైఎస్సార్‌సీపీలో చేరుతున్నట్టు పేర్కొన్నారు. ఆటపాకలో రూ.కోట్ల వ్యయంతో అనేక అభివృద్ధి పనులు చేశామన్నారు. ఎమ్మెల్యే అభ్యర్థిగా తనను, ఏలూరు ఎంపీ అభ్యర్థిగా పోటీ చేస్తున్న కారుమూరి సునీల్‌కుమార్‌యాదవ్‌ను అత్యధిక మెజార్టీతో గెలిపించి జగనన్నను తిరిగి ముఖ్యమంత్రి చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ అడవి వెంకటకృష్ణమోహన్, ఎంపీటీసీ సభ్యుడు మంగినేని రామకృష్ణ, సొసైటీ అధ్యక్షుడు పంజా రాంబాబు, గోపవరం సర్పంచ్ ఉలిసి వసంతకుమారి, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

క్లుప్తంగా

నేడు కొట్టు నామినేషన్


డిప్యూటీ సీఎం కొట్టు సత్యనారాయణ

తాడేపల్లిగూడెం: వైఎస్సార్ సీపీ అభ్యర్థిగా ఉప ముఖ్యమంత్రి, దేవదాయశాఖామంత్రి కొట్టు సత్యనారాయణ గురువారం నామినేషన్ దాఖలు చేయనున్నారు. ఉదయం పది నుంచి 12 గంటల మధ్య నామినేషన్ దాఖలు చేస్తారు. ఈ సందర్భంగా క్యాంపు కార్యాలయం నుంచి అభిమానులు, నాయకులు, కార్యకర్తలతో కలిసి రిటర్నింగ్ అధికారి కార్యాలయానికి చేరుకుంటారు. అందరూ పెద్ద ఎత్తున తరలివచ్చి నామినేషన్ కార్యక్రమం విజయవంతం చేయాలని కొట్టు సత్యనారాయణ కోరారు.

ఘనంగా అయ్యప్ప స్వామి విగ్రహ ప్రతిష్ఠ


అయ్యప్పస్వామి పల్లకి ఉత్సవం

తాడేపల్లిగూడెం రూరల్: మండలంలోని మాధవరం గ్రామంలో అయ్యప్ప స్వామివారి విగ్రహ ప్రతిష్ఠ మహోత్సవం బుధవారం అత్యంత వైభవంగా జరిగింది. తొలుత గణపతి పూజ, నవరత్న న్యాసం, యంత్ర, విగ్రహ, శిఖర ప్రతిష్ఠ పూజలు నిర్వహించారు. అలాగే, జీవన్యాసం, మహాపూర్ణాహుతి, కుంభాభిషేకం, ఆచార్య పూజ, గోదృష్టి పూజలను జరిపి, అనంతరం భక్తులకు స్వామివారి దర్శన భాగ్యాన్ని కల్పించారు. పలువురు దంపతులు పూజాదికాలను దగ్గరుండి జరిపించారు. అయ్యప్ప స్వామి వారిని దర్శించేందుకు స్థానికులతో పాటు పరిసర గ్రామాల నుంచి భక్తులు పెద్ద సంఖ్యలో తరలివచ్చారు. దీంతో గ్రామం కోలాహలంగా మారింది. ఆలయ కమిటీ సభ్యులు, పెద్దలు పాల్గొన్నారు.

ఆర్టీసీ కాంప్లెక్స్‌లో చలివేంద్రం ఏర్పాటు


కాంప్లెక్స్‌లో మజ్జిగ పంపిణీ చేస్తున్న డిపో మేనేజర్ వైఎస్ఎన్ మూర్తి

తాడేపల్లిగూడెం (టీఓసీ): ఏపీఎస్ ఆర్టీసీ కాంప్లెక్స్‌లో బుధవారం శ్రీ సత్యసాయి బాబా ట్రస్ట్ సేవా సంఘం సభ్యులచే చలివేంద్రం ఏర్పాటు చేశారు. ప్రయాణికులకు మజ్జిగ పంపిణీ చేశారు. డిపో మేనేజర్ వైఎస్ఎన్ మూర్తి, ట్రస్ట్ నిర్వాహకులు, సభ్యులు, ఆర్టీసీ ఉద్యోగులు, సిబ్బంది పాల్గొన్నారు.

ఓటు హక్కును సద్వినియోగం చేసుకోండి


దాసం నాగేశ్వరరావును సత్కరిస్తున్న విశ్రాంత ఉద్యోగులు

తాడేపల్లిగూడెం (టీఓసీ): రానున్న సార్వత్రిక ఎన్నికలలో ప్రతి ఒక్కరూ వారి పవిత్రమైన ఓటును సద్వినియోగం చేసుకోవాలని రాష్ట్ర ప్రభుత్వ విశ్రాంత ఉద్యోగుల అసోసియేషన్ అధ్యక్షుడు కె.బాలకృష్ణ కోరారు. పట్టణంలో సంఘ కార్యాలయంలో బుధవారం అసోసియేషన్ సమావేశం జరిగింది. బాలకృష్ణ మాట్లాడుతూ డీఆర్ బకాయిలు, పీఆర్‌సీ ఎరియర్స్ త్వరలో వస్తాయని ఆశాభావం వ్యక్తం చేశారు. ఇటీవల రాష్ట్ర సంఘం సెక్రటరీగా ఎన్నికైన దాసం నాగేశ్వరరావును ఘనంగా సన్మానించారు. యూనిట్ ఆర్థిక నివేదికను ఆమోదించారు. ఈ కార్యక్రమంలో వీవీఎస్ఎన్ మూర్తి, ఎండీవీ ముస్తాఫా, గరికిపాటి సుబ్రహ్మణ్య శర్మ, గాజుల మురళీకృష్ణ, దాసం వెంకట రమణ, ఎండీ భాషా, తాతా శ్రీనివాసరావు, ప్రకాశ్‌రావు పాల్గొన్నారు.

మంత్రి కారుమూరి పరామర్శ

ఇరగవరం: మండలంలోని కత్తవపాడు గ్రామానికి చెందిన వైఎస్సార్ సీపీ నాయకులు జవ్వాది హరిబాబు కుమారుడు ఇటీవల అనారోగ్య సమస్యతో మృతి చెందడం జరిగింది. బుధవారం వారి కుటుంబాన్ని మంత్రి, తణుకు వైఎస్సార్ సీపీ అభ్యర్థి కారుమూరి నాగేశ్వరరావు పరామర్శించారు. హరిబాబు కుమారుడి ఫోటోకు పూలమాలలు వేసి నివాళ్లులర్పించారు. ఈ కార్యక్రమంలో మండల పార్టీ అధ్యక్షుడు కొప్పిశెట్టి దుర్గా ప్రసాద్, జవ్వాది సురేష్, తదితరులు పాల్గొన్నారు.

12 మంది వలంటీర్ల రాజీనామా

ఉండి: మండలంలోని పాములపర్రు గ్రామానికి చెందిన 12 మంది వలంటీర్లు బుధవారం రాజీనామాలు చేశారు. తమ రాజీనామాలను గ్రామ పంచాయతీ కార్యాలయంలో సమర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రభుత్వ పథకాలను పేదలకు అందజేయడంతోపాటు కరోనా సమయంలో ప్రాణాలకు తెగించి పనిచేసిన తమపై టీడీపీ, జనసేన నాయకులు చేస్తున్న తప్పుడు ప్రచారాన్ని తట్టుకోలేక రాజీనామా చేసినట్లు చెప్పారు. తామంతా జగనన్నకు తోడుగా ఉంటామన్నారు.

వైఎస్సార్ సీపీ అభ్యర్థులను గెలిపించండి

గ్రామాల్లో జోరుగా ప్రచారాలు


తణుకు అర్బన్: ఎన్నికల ప్రచారంలో పాల్గొన్న మంత్రి కారుమూరి కుమార్తె దీపిక, కోడలు కీర్తి


అత్తిలి: రామన్నపేటలో ఎన్నికల ప్రచారం నిర్వహిస్తున్న మండల వైఎస్సార్‌సీపీ నాయకులు


అత్తిలి: కుమ్మర శాలివాహన సంఘ ప్రతినిధులకు ఎన్నికల ప్రచార కరపత్రాలను అందజేస్తున్న దృశ్యం


తణుకు టౌన్: తేతలిలో ఇంటింటా ఎన్నికల ప్రచారం చేస్తున్న వైఎస్సార్ సీపీ మండల అధ్యక్షుడు బోడపాటి వీర్రాజు

తణుకు అర్బన్: ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పేదలకు పారదర్శకంగా అందించిన సంక్షేమం చరిత్రలో నిలుస్తుందని రాష్ట్ర మంత్రి కారుమూరి నాగేశ్వరరావు కుమార్తె దీపిక, కోడలు కీర్తి అన్నారు. తణుకు 21వ వార్డులో బుధవారం నిర్వహించిన ఎన్నికల ప్రచారంలో వారు పాల్గొని మాట్లాడారు. ఇంతవరకు ఏ ముఖ్యమంత్రి ఆలోచనచేయని సంక్షేమాన్ని రూపొందించి పేదవర్గాలను ఆర్థికంగా బలోపేతం చేసిన ఘనత జగనన్నకే దక్కుతుందని స్పష్టం చేశారు. ప్రతి పథకంలోను మహిళలనే లబ్ధిదారులుగా చేర్చి మహిళా పక్షపాతిగా సీఎం జగన్ నిలిచారని, చేసిన మంచిని గుర్తుంచుకుని జగనన్నకు అండగా నిలబడాలన్నారు. మీ కుటుంబానికి మంచి జరిగితేనే నాకు అండగా నిలబడమన్న ఏకైక నేత జగనన్న మాత్రమేనని అన్నారు. వచ్చే ఎన్నికల్లో తణుకు అసెంబ్లీ అభ్యర్థిగా కారుమూరి నాగేశ్వరరావును, ఎంపీ అభ్యర్థిగా గూడూరి ఉమాబాలను రెండు ఓట్లు ఫ్యాన్ గుర్తుపై వేసి గెలిపించాలని కోరారు. ఈ సందర్భంగా సంక్షేమ పథకాలను తెలిపే కరపత్రాలను ప్రజలకు అందచేశారు. ఈ కార్యక్రమంలో పట్టణ మహిళాధ్యక్షురాలు నూకల కనకదుర్గ, కాపు సంఘ అధ్యక్షుడు వంటెద్దు ఈశ్వరప్రసాద్, ఝాన్సీ లారెన్స్, షేక్ ఫహీమా, అద్దాల రామకృష్ణ, దోలా ఆదినారాయణ, కపిల వెంకట రమణకుమార్, ఎ.ఈశ్వరకుమార్, సీపాని శ్రీను, కె.సోమసుందరం, వంకాయల గోవిందరాజు, జీఎస్‌వీప్రసాద్, రేలంగి రాంబాబు తదితరులు పాల్గొన్నారు.

రామన్నపేటలో వైఎస్సార్ సీపీ ఎన్నికల ప్రచారం

అత్తిలి: ప్రజా సంక్షేమమే వైఎస్సార్ సీపీ ప్రభుత్వ ధ్యేయమని వైఎస్సార్ సీపీ మండల అధ్యక్షుడు పైబోయిన సత్యనారాయణ అన్నారు. బుధవారం అత్తిలి శివారు రామన్నపేటలో వైఎస్సార్ సీపీ నాయకులు ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈసందర్భంగా పైబోయిన మాట్లాడుతూ పేద ప్రజలకు ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ పథకాలు భవిష్యత్‌లో కొనసాగాలంటే రానున్న ఎన్నికల్లో వైఎస్సార్ సీపీని గెలిపించుకోవాలన్నారు. ఓటర్లు తమ రెండు ఓట్లను ఫ్యాన్ గుర్తుపై వేసి తణుకు ఎమ్మెల్యేగా కారుమూరి నాగేశ్వరరావు, నర్సాపురం ఎంపీగా గూడూరి ఉమాబాలను గెలిపించాలని కోరారు. కార్యక్రమంలో అత్తిలి ఏఎంసీ చైర్మన్ బుద్దరాతి భరణీ ప్రసాద్, సర్పంచ్ గంటా విజేతనాగరాజు, ఉపసర్పంచ్ మద్దాల శ్రీనివాస్, ఎంపీటీసీ సభ్యురాలు రంభ సుజాత, అత్తిలి పట్టణ అధ్యక్షుడు పోలినాటి చంద్రరావు, మండల పార్టీనాయకులు రంభ సూరిబాబు, గారపాటి నాగరాజు, కోరుకొల్లు వెంకట్రావు, సబ్బితి రాజేష్, కంకటాల సతీష్, కాగసాని అబ్బులు, నల్లమిల్లి శ్రీనివాసరెడ్డి, రంభ రాంబాబు, కాసగాని చిన్నా, సలుమూరి అప్పాజీ, బుంగా పద్మారావు, రావూరి సత్యనారాయణ, గొర్లె రాము, యాళ్లస్వామి, దుడే ఉమ, దాసరి శ్రీను, పూడిముడి ప్రసాద్,యడ్లపల్లి దుర్గారావు, ప్రసాద్, దాసిరెడ్డి భగవాన్ పాల్గొన్నారు.

వైఎస్సార్ సీపీకి అండగా నిలబడాలి

అత్తిలి: వైఎస్సార్ సీపీ ప్రభుత్వ హయాంలో రాష్ట్రంలో అన్ని వర్గాల ప్రజలకు పారదర్శకంగా సంక్షేమ పథకాలు అందజేశామని రాష్ట్ర కుమ్మర శాలివాహన వెల్ఫేర్ కమిటీ సభ్యుడు బిరుదకోట చింతన్న అన్నారు. అత్తిలిలో కుమ్మర శాలివాహన సంఘ ప్రతినిధులను ఆయన కలుసుకుని వైఎస్సార్ సీపీ ఎన్నికల ప్రచార కరపత్రాలను అందజేశారు. ఈసందర్భంగా చింతన్న మాట్లాడుతూ వైఎస్సార్ సీపీ ప్రభుత్వ హయాంలో ఇప్పటి వరకు రాష్ట్రంలో కుమ్మర శాలవాహనుల అవ్వ తాతలకు, అక్కచెల్లెమ్మలకు, విద్యార్థులకు వివిధ సంక్షేమ పథకాల ద్వారా 6,25,262 మందికి రూ. 1,681 కోట్లు ఆర్థిక లబ్ధి చేకూరిందన్నారు. ప్రతి గడప వద్దకు సంక్షేమ పాలన అందిస్తున్న వైఎస్సార్ సీపీకి రానున్న ఎన్నికల్లో కుమ్మర శాలివాహనులంతా అండగా నిలవాలన్నారు. సంఘ సభ్యులంతా రెండు ఓట్లను ఫ్యాన్ గుర్తుపై వేసి, తణుకు ఎమ్మెల్యే అభ్యర్థి కారుమూరి వెంకట నాగేశ్వరరావు, ఎంపీ అభ్యర్థిని గూడూరి ఉమాబాలను గెలిపించాలని కోరారు. కార్యక్రమంలో కుమ్మర శాలివాహన సంఘ ప్రతినిధులు ఇరగవరపు నరశింహారావు, మంతెన భాస్కరరావు, ఇరగవరపు రామకృష్ణ, శనగన ఏడుకొండలు, వీర్రాజు తదితరులు పాల్గొన్నారు.

సంక్షేమం కొనసాగాలంటే జగన్ రావాలి

తణుకు టౌన్: రాష్ట్రంలో సంక్షేమం కొనసాగాలంటే మళ్లీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి రావాలని వైఎస్సార్ సీపీ మండల అధ్యక్షుడు బోడపాటి వీర్రాజు అన్నారు. తణుకు మండలంలోని వివిధ గ్రామాల్లో ముమ్మరంగా ఎన్నికల ప్రచారం నిర్వహించారు. బుధవారం తణుకు రూరల్ మండలం తేతలి గ్రామంలో మండల వైఎస్సార్ సీపీ అధ్యక్షుడు బోడపాటి వీర్రాజు ఆధ్వర్యంలో తేతలి గ్రామంలో ఇంటింటికి తిరిగి వైఎస్సార్ సీపీ తణుకు ఎమ్మెల్యే అభ్యర్థి, రాష్ట్ర మంత్రి కారుమూరి నాగేశ్వరరావు, ఎంపీ అభ్యర్థిగా గూడూరి ఉమాబాలను ఫ్యాన్ గుర్తులపై ఓట్లేసి గెలిపించాలని కోరుతూ ఓట్లను అభ్యర్థించారు. ఈకార్యక్రమంలో తేతలి గ్రామ కమిటీ అధ్యక్షుడు కోట నాగేశ్వరరావు, మండల పార్టీ ఉపాధ్యక్షుడు సరెళ్ల వీరతాత, సొసైటీ అధ్యక్షుడు పీ సతీష్ రాజు, నాయకులు, దారం శ్రీను, కోట స్వామీజీ, భూపతిరాజు రామకృష్ణంరాజు, వలవల కిషోర్, సత్యనారాయణ, మానేపల్లి సంపత్‌రావు పాల్గొన్నారు. మండలంలోని పలు గ్రామాల్లో గ్రామ కమిటీల ఆధ్వర్యంలో పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

వైఎస్సార్ సీపీ విజయం తథ్యం

ఇరగవరం: సీఎం జగన్‌మోహన్‌రెడ్డితోనే సామాజిక న్యాయం సాధ్యమని తణుకు నియోజకవర్గ ఎస్సీ సెల్ అధ్యక్షుడు పొట్ల సురేష్ అన్నారు. మండలంలోని తూర్పు విప్పర్రు గ్రామంలో బుధవారం వైఎస్సార్ సీపీ అభ్యర్థుల తరుపున ప్రచారం నిర్వహించారు.ఈ సందర్భంగా సురేష్ మాట్లాడుతూ రాష్ట్రంలోని ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీల సంక్షేమానికి సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అత్యంత ప్రాధా న్యత ఇస్తున్నారని తెలిపారు. ప్రజా సంక్షేమమే ధ్యేయంగా సీఎం జగన్ పాలన అందిస్తున్నారని తెలిపారు. సంక్షేమం కావాలంటే తప్పనిసరిగా మళ్లీ జగన్‌మోహన్ రెడ్డిని సీఎంగా చేసుకోవాలన్నారు. నవరత్నాలు ద్వారా అన్ని వర్గాల ప్రజలకు లబ్ధి చేకురిందన్నారు. మంత్రి కారుమూరి నాగేశ్వరరావు ఎంతో శ్రమించి నియోజకవర్గాన్ని అభివృద్ధి పథంలో నడిపిస్తున్నారన్నారు. ఎమ్మెల్యేగా కారుమూరి నాగేశ్వరరావును, ఎంపీగా గూడూరి ఉమాబాలాలను గెలిపించుకోవాలని కోరారు. వైఎస్సార్ సీపీ నాయకులు త్రిమూర్తులు, చినబాబు పాల్గొన్నారు.

విద్యార్థుల భవిష్యత్‌కు పదో తరగతి కీలక మలుపు


విద్యార్థులను అభినందిస్తున్న ఎంఈవో-2 పీఎంకే.జ్యోతి

తాడేపల్లిగూడెం రూరల్: విద్యార్థుల బంగారు భవిష్యత్‌కు పదో తరగతి ఎంతో ప్రాధాన్యత సంతరించుకోవడంతో పాటు కీలక మలుపు వంటిదని ఎంఈవో-2 పీఎంకే.జ్యోతి అన్నారు. బుధవారం సాయంత్రం స్థానిక మండల పరిషత్ సమావేశ మందిరంలో తాడేపల్లిగూడెం టౌన్, రూరల్ నుంచి పదో తరగతిలో ఉత్తమ ఫలితాలు సాధించిన విద్యార్థులకు అభినందన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంఈవో-2 జ్యోతి మాట్లాడుతూ పదో తరగతి తర్వాత వారికి ఏం చేయాలనేది అర్థమవుతుందన్నారు. అయితే పదో తరగతి విద్యార్థులను పరీక్షలకు సిద్ధం చేయడం ఎంతో కష్టంతో కూడుకున్నదన్నారు. ఈ దశలో ఎటువంటి పొరపాట్లు జరగకుండా తామంతా ఎంతో శ్రద్ధ వహించామన్నారు. ఈ క్రమంలోనే మండలంలోని 25 పాఠశాలలకు గాను 16 పాఠశాలలను సందర్శించి, పదో తరగతి విద్యార్థుల విద్యాప్రమాణాలను పరిశీలించడం జరిగిందన్నారు. పదో తరగతిలో సంతృప్తినిచ్చే ఫలితాలు తీసుకొచ్చిన విద్యార్థులను ఆమె అభినందించారు. అనంతరం విద్యార్థులను మెమెంటోతో సత్కరించారు. కార్యక్రమంలో ప్రధా నోపాధ్యాయులు ఎస్ఎస్.శ్రీనివాస్, సీహెచ్.చంద్రశేఖర్, డీఎస్ఎన్.మూర్తి, ఎన్.శ్రీనివాసరావు, ఎం.సత్యనారాయణ, సీఆర్పీలు బత్తులనానిబాబు, నగేష్, విద్యార్థులు, వారి తల్లిదండ్రులు పాల్గొన్నారు.

రంగస్థల కళాకారుల సంఘ సమావేశాన్ని విజయవంతం చేయండి

తాడేపల్లిగూడెం (టీఓసీ): పట్టణంలో ఈ నెల 28వ తేదీ ఆదివారం సాయంత్రం 6 గంటల నుంచి స్థానిక ఆర్టీసీ కాంప్లెక్స్ సమీపంలోని గీతా మందిరం ప్రాంగణంలో రంగస్థల కళాకారుల సంక్షేమ సంఘ 143వ సమావేశం జరుగుతుందని సంఘ అధ్యక్షుడు సూరంపూడి వెంకట రమణ వెల్లడించారు. గౌరవ సత్కారం భవన నిర్మాణ సంఘం నాయకులు పడాల శ్రీనివాస్‌కు, కళా సత్కారం కళాకారులు దిర్శిపాముల వెంకటరత్నం, ఉద్యోగ సేవ పురస్కారం డాక్టర్ గాదం గోపాలస్వామి, ఆర్థిక సత్కారం సీనియర్ నటీ అంజలీదేవిలకు ఇవ్వనున్నట్లు వెల్లడించారు. కళాకారులు, ప్రముఖులు, ప్రజలు హాజరుకావాలని, విజయవంతం చేయాలని కోరారు.

కార్మికుల జీవితాలను సంక్షోభంలోకి నెట్టిన కేంద్రం


పెదతాడేపల్లి పీఎం దాల్ మిల్లు కార్మికులు కరపత్రాలను ఆవిష్కరిస్తున్న దృశ్యం

తాడేపల్లిగూడెం రూరల్: కేంద్రంలోని బీజేపీ మోదీ ప్రభుత్వం సంఘటిత, అసంఘటిత కార్మికుల జీవితాలను సంక్షోభంలోకి నెట్టిందని ఇఫ్టూ నాయకుడు మామిడి దానవరప్రసాద్ విమర్శించారు. ఇఫ్టూ జాతీయ కమిటీ ముద్రించిన కరపత్రాలను బుధవారం మండలంలోని పెదతాడేపల్లి పీఎం దాల్ మిల్లు కార్మికులతో ఆవిష్కరించారు. ఈ సందర్భంగా దానవరప్రసాద్ మాట్లాడుతూ మోదీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన పదేళ్ళ కాలంలో ప్రభుత్వ రంగాలను ప్రైవేట్ పరం చేసిందన్నారు. కార్మికుల జీవన ప్రమాణాలను పెంచాల్సిన ప్రభుత్వం పర్మినెంట్ ఉద్యోగాలు లేకుండా చేస్తుందన్నారు. మతోన్మాద దాడులకు వ్యతిరేకంగా పోరాడుతున్న ప్రజలపై, కార్మిక హక్కులపై బీజేపీ ఆర్ఎస్ఎస్ మోదీ ప్రభుత్వం దాడులు కొనసాగిస్తుందన్నారు. ఇటువంటి తరుణంలో 138వ మేడేను జయప్రదానికి పిలుపునిచ్చారు. ప్రజావ్యతిరేక విధానాలను వ్యతిరేకిస్తూ కార్మిక వర్గం ఐకమత్యంతో సమరశీల పోరాటాలకు సిద్ధం కావాలన్నారు. ఈ కార్యక్రమంలో డి.వెంకట్రావు, పులపాకుల రాములు, డి.రామారావు, నల్లి సత్యనారాయణ, నలగంటి నాగేశ్వరరావు, నాగయ్య, లక్ష్మి, కుమారి పాల్గొన్నారు.

కనకదుర్గమ్మకు టేకు ఊయల సమర్పణ

యలమంచిలి: అడవిపాలెం గ్రామ దేవత కనకదుర్గమ్మ అమ్మవారికి ఆలయ వంశపారంపర్య ధర్మకర్త బొలిశెట్టి రావులియ్య కుటుంబ సభ్యులు బుధవారం రూ.25 వేలు విలువ చేసే టేకు ఊయల సమర్పించారు. రావులియ్య కుమార్తె శిరీష, సతీష్ దంపతులకు ద్వితీయ కుమారుడు రుద్రశ్రీ నందన్ జన్మించారు. గ్రామ దేవత కనకదుర్గమ్మ అమ్మవారికి సంతాన లక్ష్మీగా పేరుంది. ఈ నేపథ్యంలో అమ్మవారి గుడిలో పిల్లలను ఊయలలో వేసే సంప్రదాయాన్ని నెలకొల్పుతూ టేకు ఊయల సమర్పించి ముందుగా నందన్‌ను ఊయలలో వేశారు. ఈ సందర్భంగా ఆలయ అర్చకుడు సుదర్శనం శ్రీనివాస్ ప్రత్యేక పూజలు నిర్వహించగా విజయవాడ నుంచి వచ్చి పండితులు శాంతి హోమం చేశారు.

తణుకు సేఫ్‌కేర్ సెంటర్ సేవలు అభినందనీయం


తణుకు సేఫ్‌కేర్ సెంటర్‌లో చిన్నారులకు పోషకాహారం అందజేస్తున్న వైద్యులు

తణుకు అర్బన్: హెచ్ఐవీ బాధిత చిన్నారులకు పోషకాహారం అందజేయడం అభినందనీయమని సేఫ్‌కేర్ సెంటర్ నోడల్ ఆఫీసర్ డాక్టర్ పుప్పాల రాజరాజేశ్వరి అన్నారు. తణుకు జిల్లా కేంద్ర ఆస్పత్రిలోని సేఫ్ కేర్ సెంటర్‌లో హెచ్ఐవీ బాధిత చిన్నారులకు స్థానిక ఇషా హాస్పిటల్ వైద్యులు డాక్టర్ బొర్రా మురళీకృష్ణ సౌజన్యంతో పోషకాహారాన్ని అందజేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ హెచ్ఐవీ బాధిత చిన్నారులకు మందులతో పాటు పోషకాహారం తీసుకోవడం కూడా చాలా అవసరమని అన్నారు. షేర్ ఇండియా ప్రాజెక్ట్ ఆఫీసర్ జగదీష్ మాట్లాడుతూ జిల్లాలోని సేఫ్‌కేర్ సెంటర్లన్నిటిలోను తణుకు సెంటర్ సేవలు అజరామర మని, వ్యాధిగ్రస్తులకు సత్వర సేవలందించడమే కాకుండా వారికి అవసరమైన పోషకాహారాన్ని సైతం గత రెండేళ్లుగా దాతలను సేకరించి అందించడం మంచి పరిణామమన్నారు. సేఫ్‌కేర్ సెంటర్ వైద్యాధికారి డాక్టర్ సుంకవల్లి రామకృష్ణ అధ్యక్షతన నిర్వహించిన ఈ కార్యక్రమంలో సేఫ్ కేర్ సెంటర్ సిబ్బంది, హెచ్ఐవీ బాధిత చిన్నారులు పాల్గొన్నారు.

పదిలో సత్తా చాటిన ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులు

- అత్తిలి విద్యార్థి రేవంత్‌కుమార్ 590 మార్కులతో జిల్లా ఫస్ట్
- 72 శాతం పాస్‌తో తణుకు నియోజకవర్గం


భీమవరంలో 590 మార్కులు సాధించిన అత్తిలి విద్యార్థి రేవంత్‌కుమార్‌ను అభినందిస్తున్న డీఈవో ఆర్‌వీ రమణ


తణుకు జెడ్పీ బాయ్స్ హైస్కూల్ ప్రాంగణంలో పదో తరగతి విద్యార్థుల సందడి (ఫైల్)

తణుకు అర్బన్: పదో తరగతి పరీక్షా ఫలితాల్లో ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులు మంచి మార్కులతో సత్తా చాటారు. ముఖ్యంగా ఇంగ్లీషు మీడి యం విద్యార్థులు అత్యధికంగా ఉత్తీర్ణత సాధించా రు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి విద్యారంగానికి ఇచ్చిన అత్యధిక ప్రాధాన్యతను విద్యార్థులు సద్వినియోగపరచుకుని మంచి మార్కులు సాధించారు. తణుకు నియోజకవర్గంలోని తణుకు మున్సిపాల్టీ, తణుకు, అత్తిలి, ఇరగవరం మండాలలకు సంబంధించి రూ. 149.53 కోట్లు నాడు -నేడు నిధులతో పాఠశాలల రూపురేఖలు మార్చడంతో పాటు తరగతి గదుల్లోని డెస్కులు, టాయిలెట్స్, తాగునీరు, ప్రహరీలు, భవన నిర్మాణాలు వంటి సౌకర్యాలను విద్యార్థులు చక్కగా వినియోగించుకున్నారనడానికి పది పరీక్షా ఫలితాలే నిదర్శనంగా నిలుస్తున్నాయి. అంతేకాకుండా అమ్మ ఒడి, విద్యా కానుక, జగనన్న గోరుముద్ద వంటి పథకాలు విద్యార్థులు, తల్లితండ్రులు స్వాగతించారు.

తణుకు నియోజకవర్గంలో..

తణుకు నియోజకవర్గంలో 28 పాఠశాలల్లో 1,740 మంది పదో తరగతి విద్యార్థులు పరీక్షలు రాయగా 72 శాతంతో 1256 మంది విద్యార్థులు ఉత్తీర్ణత సాధించారు. ఉత్తీర్ణతే కాకుండా విద్యార్థుల్లో అధికశాతం మంచి మార్కులు సాధించడం కూడా విద్యావ్యవస్థలో వచ్చిన మార్పులను స్పష్టం చేస్తోంది. ముఖ్యంగా ప్రభుత్వ పాఠశాలల్లో ఇంగ్లీషు మీడియం వద్దన్న ప్రతిపక్షాలకు చెంపపెట్టుగా తణుకు నియోజకవర్గంలో ఇంగ్లీషు మీడియం విద్యార్థులు 82 శాతంతో ఉత్తీర్ణత సాధించగా తెలుగు మీడియం విద్యార్థులు 57 శాతంతో ఉత్తీర్ణత సాధించడం విశేషం. నియోజకవర్గంలో అత్తిలి హైస్కూల్ విద్యార్థి సీహెచ్ రేవంత్‌కుమార్ 590 మార్కులు సాధించి మొదటి స్థానంలోను, అత్తిలి గరల్స్ హైస్కూల్ చెందిన ఎస్‌వీఎస్ఎస్ త్రివేణి 582 మార్కులతో ద్వితీయ స్థానంలోను, తణుకు జాస్తి సీతామహాలక్ష్మి బాలికోన్నత పాఠశాల విద్యార్థిని కొంపెల్ల శ్రీసత్య కార్తికేయని 581 మార్కులతో మూడవ స్థానంలో నిలిచారు.

అత్తిలి విద్యార్థి 590 మార్కులతో జిల్లా ఫస్ట్..

పదో తరగతి పరీక్షా ఫలితాల్లో ప్రభుత్వ పాఠశాలలకు సంబంధించి అత్తిలి ప్రభుత్వ ఉన్నత పాఠశాలకు చెందిన సీహెచ్ రేవంత్ కుమార్ జిల్లా ఫస్ట్‌గా నిలిచాడు. పశ్చిమ గోదావరి జిల్లాకు సంబంధించి పదో తరగతి పరీక్షల్లో 12,913 మంది పరీక్షలు రాయగా అందులో 9396 మంది ఉత్తీర్ణత సాధించగా రేవంత్‌కుమార్ 590 మార్కులు సాధించి ప్రభుత్వ పాఠశాలల సత్తా చాటాడు. ఎస్వీఎస్ఎస్ ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో ఇంగ్లీషు మీడియంలో విద్యను అభ్యసించిన రేవంత్‌కుమార్ తండ్రి ఏసుకుమార్ ప్రైవేటు కళాశాల బస్సు డ్రైవరుగా విధులు నిర్వర్తిస్తుండగా, తల్లి గృహిణి. మంగళవారం భీమవరంలో జిల్లా విద్యాశాఖాధికారి ఆర్‌వీ రమణ అత్తిలి విద్యార్థి రేవంత్ కుమార్‌కు పుష్పగుచ్ఛం అందజేసి అభినందించారు. అత్తిలి ఎంఈవో నారగాని రమేష్ పాల్గొన్నారు.

అత్యుత్తమ విద్యాబోధన



సీఎం జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వ పాఠశాలలను నాడు-నేడు కార్యక్రమం ద్వారా ఆధునీకీకరించడంతో కార్పొరేట్ పాఠశాలలకు దీటుగా ప్రభుత్వ పాఠశాలలు ఉన్నాయి. ప్రభుత్వ పాఠశాలల్లో క్వాలిఫైడ్ ఉపాధ్యాయులు అందుబాటులో ఉండడంతో అత్యుత్తమ విద్యాబోధన చేస్తున్నారు. పాఠశాలలో డిజిటల్ విధానంలో, ఆహ్లాదకరమైన వాతావరణంలో విద్యనభ్యసించడం ద్వారా 590 మార్కులు సాధించగలిగాను. ఇంటర్మీడియట్ ద్వారా ఉన్నత విద్యను అభ్యసించి, జీవితంలో మంచి స్థాయికి చేరుకోవాలన్నదే నా లక్ష్యం.

– సీహెచ్ రేవంత్ కుమార్, అత్తిలి జిల్లా పరిషత్ హైస్కూల్ విద్యార్థి

కఠిన శ్రమ వల్లే చక్కటి ఫలితాలు



నేటి రోజుల్లో ప్రైవేటు పాఠశాలల కన్నా ప్రభుత్వ పాఠశాలలు మౌలిక వసతులు, విద్యాబోధన విరాజిల్లుతున్నాయి. గతంలో ప్రభుత్వ పాఠశాలలంటే భయపడే పరిస్థితి ఉండగా నేడు మాత్రం విద్యార్థులకు అవసరమైన అన్ని వసతులు అందుబాటులో ఉన్నాయి. ఉపాధ్యాయులు చెప్పిన పాఠ్యాంశాలను శ్రద్ధగా వినడంతో పాటు ఇంటివద్ద కూడా ఆ పాఠ్యాంశాలపై కఠినంగా శ్రమించడం వలనే నేను 582 మార్కులు సాధించగలిగాను. ఉపాధ్యాయుల కృషి, తల్లి తండ్రుల ప్రోత్సాహమే నా విజయం.

– ఎస్‌వీఎస్ఎస్ త్రివేణి, అత్తిలి జిల్లా పరిషత్ గరల్స్ హైస్కూలు విద్యార్థిని

ఐఏఎస్ ఆఫీసర్ కావాలని ఉంది



ప్రభుత్వ పాఠశాలల్లో గతంలో కంటే ఎంతో మెరుగైన వసతులు ప్రభుత్వం కల్పించింది. చక్కని వాతావరణంలో విద్యాభ్యాసం చేసే పరిస్థితి ఉండడంతో విద్యార్థులంతా విద్య పైనే దృష్టి సారించారు. తణుకు జాస్తి సీతామహాలక్ష్మి బాలికోన్నత పాఠశాలలో మా ఉపాధ్యాయులు మాపై ఎంతో శ్రద్ధ చూపించారు. జగనన్న పేద విద్యార్థులకు కోసం ఎంతో కృషి చేస్తున్నారు. ఉపాధ్యాయుల కృషి, తల్లితండ్రుల ప్రోత్సాహమే మరువలేనన్నారు. 581 మార్కులు సాధించినందుకు చాలా సంతోషంగా ఉంది. భవిష్యత్తులో ఐఏఎస్ ఆఫీసర్ కావాలని ఉంది.

– కొంపెల్ల శ్రీసత్య కార్తికేయని, జాస్తి సీతామహాలక్ష్మి బాలికోన్నత పాఠశాల విద్యార్థిని, తణుకు

చురుగ్గా కొత్తోట- కోమటితిప్ప రహదారి పనులు

మొగల్తూరు: మండలంలోని కొత్తోట-కోమటితిప్ప రహదారి పనులు చురుగ్గా సాగుతున్నాయి. కొత్తోట, కోమటితిప్ప, నీటితిప్ప, జిల్లేడుతిప్ప గ్రామాలకు సంబంధించి రూ.9 కోట్లు మంజూరు కాగా ఎన్నికల కోడ్ రాకముందు రహదారి పనులకు చీఫ్ విప్ ముదునూరి ప్రసాదరాజు రహదారి పనులకు శంకుస్థాపన చేశారు. నాలుగు గ్రామాలను కలుపుతూ సుమారు 17 కిలో మీటర్ల మేర చేపట్టిన రోడ్డు పనులు వేగవంతంగా సాగుతున్నాయి. ఇప్పటికే నీటితిప్ప, జిల్లేడుతిప్ప రహదారి పనులు దాదాపుగా పూర్తికాగా కొత్తోట, కోమటితిప్ప రహదారి పనులు చురుగ్గా సాగుతున్నాయి. ఈ నాలుగు గ్రామాలకు సంబంధించి వేలాది ఎకరాల్లో చేపలు, రొయ్యల చెరువులున్నాయి. దీంతో నిత్యం వందలాది లారీలు, వివిధ వాహనాలు నాలుగు గ్రామాల మధ్య తిరుగుతూ ఉంటాయి. దీంతో రహదారి పనుల్లో నాణ్యతా ప్రమాణాలు పాటించేలా నిర్మించాలని గతంలోనే ఆదేశించడంతో అందుకు అనుగుణంగా పనులు చేస్తున్నారు.